క్లుప్తంగా

30న హుండీల లెక్కింపు

సిరిసిల్లటౌన్: దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న సిరిసిల్లలోని ఆలయాల్లో హుండీలు లెక్కిస్తున్నట్లు శ్రీశాల వెంకన్న ఆలయ ఈవో మారుతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు పోచమ్మ ఆలయం, ఉదయం 11.30 గంటలకు శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఆలయం, మధ్యాహ్నం 1గంటకు శ్రీ విశ్వనాథస్వామి ఆలయం, మధ్యాహ్నం 2.30 గంటలకు శివసాయిబాబా ఆలయాల్లో హుండీల లెక్కింపు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



శివానిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మానుక శివాని రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎండీ షాబొద్దీన్ తెలిపారు. ఇటీవల సిరిసిల్లలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి యోగా ఎంపిక పోటీలు నిర్వహించారు. 18 ఏళ్ల విభాగంలో శివాణి మొదటి స్థానం కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం, ఫిజికల్ డైరెక్టర్ సుంకటి అజయ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా శివాణిని సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగ తదితరులు అభినందించారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం పొలాస, జగిత్యాల వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సర విద్యార్థినులు రైతులకు వ్యవసాయ మెలుకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు కాండం ముందు పూత పద్ధతిపై, రసాయనాలను పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విద్యార్థినులు వైష్ణవి, శిరీష, శ్రావణి, ప్రశాంతి, రమ్య పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

రుద్రంగి: టీబీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఇంపాక్ట్ ప్రోగ్రాం జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని 1,2వ ఆరోగ్య ఉప కేంద్రాలు, మానాల, బడితండాలో టీబీ నిర్మూలనపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రపంచంలోనే అధికంగా మన దేశంలో టీబీ కేసులు నమోదవుతున్నాయన్నారు. టీబీ మహమ్మారిని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని అందులో రాజన్న సిరిసిల్ల ఒకటన్నారు. టీబీ బారిన పడి వ్యాధిని జయించిన వారిని చాంపియన్‌లుగా గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి వారి ద్వారా టీబీ నివారణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు మధు, శైలజ, లక్ష్మీప్రసన్న, అర్చన, సూపర్‌వైజర్ దేవలక్ష్మి, ఏఎన్‌ఎంలు విజయ, రాజేశ్వరి, రజిత, కవిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం తీసుకుంటున్న మహిళలు

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ అమలు చేస్తున్న పథకాలను చూసి అన్నివర్గాల ప్రజలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో గుండవేని తిరుపతి, గూడెపు మధు, గుగ్గిళ్ల శివ, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో బీజేపీ నాయకులు మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో గ్రామంలో తిరుగుతూ ప్రజల నుంచి సభ్యత్వాన్ని సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



ఇళ్ల మధ్య డ్రైనేజీలో నిలిచిన మురుగునీరు



రహదారిపై నిలిచిన మురుగునీరు

మురుగు సమస్య తీరేదెన్నడో.!

- రుద్రంగిలో ఒర్రెలోంచి కాలనీల్లోకి చేరుతున్న మురుగునీరు
- అసంపూర్తిగా డ్రైనేజీల నిర్మాణం
- ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రుద్రంగి: మండలకేంద్రంలోని మహాలక్ష్మి కాలనీ, ఒకటో వార్డు, రామకృష్ణాపూర్ పల్లె, దుర్గమ్మ ఆలయానికి వెళ్లే దారిలోని ఒర్రెలో ఏళ్ల తరబడి మురుగునీరు నిలుస్తోంది. దుర్గమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన దారిపైకి మురుగునీరు చేరి నిత్యం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆదారి గుండా మురుగు అంటనిదే గమ్యం చేరలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే డ్రైనేజీ నిర్మాణాలు ఇళ్ల ఆవరణలోనే అసంపూర్తిగా నిర్మించడంతో మురుగంతా చేరి దుర్గంధం వెదజల్లుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా సమస్యను సమస్యను పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణం, కాలనీ మధ్యలో డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తిచేసి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



ప్రతిపాదనలకే పరిమితం..

సమస్య వచ్చినప్పుడల్లా కాలనీల ప్రజలు ఫిర్యాదు చేయడం, అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ఒర్రెను పరిశీలించి ప్రతిపాదనలు పంపుతామని చెబుతున్నారే తప్ప ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. త్వరగా ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుపైకి వస్తోంది



ఒర్రెలోని మురుగునీరంతా రోడ్డుపైకి, ఇళ్లవద్దకే వచ్చి చేరుతోంది. పనినిమిత్తం మురుగు, బురద అంటకుండా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. త్వరగా ఒర్రెపై బ్రిడ్జి నిర్మించి ఇబ్బంది లేకుండా చూడాలి.

– చింతం ఎల్లవ్వ, రుద్రంగి

దుర్గంధం వ్యాపిస్తోంది



డ్రైనేజీ నిర్మాణాలను అసంపూర్తిగా ఇళ్ల మధ్యలో వదిలేయడంతో మురుగంతా ఇళ్ల మధ్య, దారిలో నిలవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధిచెంది రోగాల బారిన పడుతున్నాం. డ్రైనేజీ నిర్మాణాలను గ్రామంలో చివ రివరకు చేపట్టాలి.

– గడ్డం భూమక్క, రుద్రంగి

ప్రతిపాదనలు పంపాం



ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– మనోహర్, పీఆర్‌ఏఈ, రుద్రంగి

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



వేములవాడరూరల్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



గంభీరావుపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

వేములవాడఅర్బన్: దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శరత్‌కుమార్ అన్నారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ దినోత్సవ వేడుకలను ప్రోగ్రాం ఆఫీసర్ అంజయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి, ర్యాలీ, పెయింటింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రేణుశ్రీ, బి.భార్గవి, కే.శృతి, టి.వాణి, డి.శరణ్య తదితరులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు శేఖర్, మహేందర్, అశోక్, రవీందర్, మహేందర్ రెడ్డి ఉన్నారు.

వేములవాడరూరల్: విద్యార్థులు సేవా గుణం కలిగి ఉండాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.లావణ్య అన్నారు. పట్టణంలోని శాత్రాజుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా నిర్వహించారు. సేఫ్టీ ఆఫ్ ద గర్ల్ చైల్డ్ అనే అంశంపై ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. సేవ్ ద వాటర్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, మూకీ డ్రామా, నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీఎస్ఆర్ శర్మ, లావణ్య, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం, సమాజసేవపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మూఢ నమ్మకాల నిర్మూలన, పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు వాణి, ఆంజనేయులు, శ్రావణ్, భార్గవి, దీపిక, శ్రీనివాస్, రాములు, జగన్నాథం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసరవేని పర్శరాములు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు చంద్రమౌళి, విష్ణుప్రసాద్, భూమక్క, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వలంటీర్లు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాలలో పరిసరాలను శుభ్రం చేసి చెత్తచెదారాన్ని తొలగించారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



అనిల్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

రుద్రంగి: మండలంలోని బడితండాకు చెందిన మాలోతు అనిల్ జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యాడు. అనిల్ కరీంనగర్‌లోని ఎస్సారార్ ఆర్ట్స్ ఆండ్ సైన్స్ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగిన జాతీయస్థాయి ట్రెక్కింగ్ సెలక్షన్స్‌లో ఎంపికకాగా అక్టోబర్ 22న హిమాచల్ ప్రదేశ్‌లో జరిగేట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.

హామీలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సబ్సిడీ కార్డులు పంపిణీ చేస్తున్న హన్మండ్లు

గంభీరావుపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నెరవేర్చుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండల శ్రీగాధ గ్రామపంచాయతీ ఆవరణలో పలువురు లబ్ధిదారులకు రూ.500 గ్యాస్ సబ్సిడీ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. రాజు, రంగారావు, రవీందర్‌రావు, కాశీ, యాదాగౌడ్, తిరుపతి, రాణి, చంద్రకళ, స్వామి, రాంచందర్‌రావు, నర్సింలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు రసాయన శాస్త్రం బోధించేందుకు ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) తో పాటు బీఈడీలో ఫిజికల్ సైన్స్ మెథడాలజీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 25న 10 గంటలకు బోయినపల్లి మోడల్‌స్కూల్‌లో జరిగే డెమోకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ రఘునాథ్ కోరారు.

ఇంటర్ మొదటి సంవత్సరం కోర్సుల్లో..

మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్, జూనియర్ కలాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ ఒక ప్రకటలో తెలిపారు. ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలికలకు ఉచిత హాస్టల్ వసతి, దూర ప్రాంతం నుంచి వచ్చే వారికి బస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

గంభీరావుపేట: ఇటీవల గణేశ్ నిమజ్జనం రోజు ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన న్యాలకొండ రాకేశ్‌రెడ్డి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, వాట్సాప్ గ్రూప్ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో మంగళవారం రూ.87వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు.

సంక్షిప్త వార్తలు

● తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడాలి

గంభీరావుపేట: తిరుమల తిరుపతి పవిత్రత, హైందవ ధర్మాన్ని కాపాడలంటూ మంగళవారం ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో హిందువులు నగర సంకీర్తనలతో ర్యాలీ నిర్వహించారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ లేకుండా చూడాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముత్యాల పల్లవి, బండారు బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు జితేందర్, వెంకటేశ్‌గౌడ్, ఈశ్వర్, నంది కిషన్, రాంరెడ్డి, దొమ్మాటి నర్సయ్య, మెండె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● అడవిపందుల దాడిలో పంట ధ్వంసం

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో అడవిపందుల దాడిలో వరిపంటలు ధ్వంసమయ్యాయి. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్ అనే రైతుకు చెందిన వరిపొలాన్ని ధ్వంసం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన బొడ్డు ప్రభాకర్, మల్లెవేని తిరుపతికు చెందిన పత్తి పంటలను కూడా ధ్వంసంచేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

● అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం

గంభీరావుపేట: పార్టీ అధిష్టాన నిర్ణయాలను శిరోధార్యంగా పాటించాలని, పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న వారిపై ఆరోపణలు చేయడం సరికాదని పట్టణశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్ అన్నారు. మండలకేంద్రంలో పార్టీ కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. నాయకులు రాజు గౌడ్, ఎలుక రాజు, ఎడబోయిన ప్రభాకర్, రాజనర్సు, విఠల్ నాయక్, నాంపల్లి పాల్గొన్నారు.

● గ్రామ కమిటీల ఎన్నిక

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో మాలల ఐక్యవేదిక గ్రామకమిటీ అధ్యక్షుడిగా బండెల ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా సామల లచ్చయ్య, ప్రధానకార్యదర్శిగా బండెల సదానందం, కార్యదర్శిగా బండి సత్తయ్య, కోశాధికారిగా బండెల విజయ్, సలహాదారులుగా బండెల రాజు, సామల రాజయ్య, మహిళా నాయకురాలిగా యాస సునంద ఎన్నికయ్యారు. వట్టిమల్లలో అధ్యక్షుడిగా గుంటి అంజయ్య, ఉపాధ్యక్షుడిగా కామిండ్ల రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా లక్కం రఘు, కోశాధికారిగా లక్కం పూర్ణచందర్, సలహాదారులుగా కామిండ్ల రవి, లక్కం శ్రీనివాస్, గుంటి చిన్న భూమయ్య, లక్కం రాజారాం, లలిత, మేకల లలిత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాందాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాదాస్ భూమయ్య, ఎడ్ల సుధాకర్, కులేరు బాబు, బత్తుల స్వామి, మాసం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తడి పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. బ్యాంక్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

వీర్నపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని చదవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రవీణ్ అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారి లింగవ్వ ఆధ్వర్యంలో మానసిక రుగ్మతపై అవగాహన కల్పించారు. కొంతమంది విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఏ సమస్య వచ్చినా మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి డాక్టర్ చిరంజీవి, ఎంఎల్ హెచ్‌పీ చైతన్య, ఏఎన్‌ఎం సుజాత, బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● నిరుపేదలకు అన్నదానం

కోనరావుపేట: మండలంలోని కొలనూరుకు చెందిన జలగం అరవింద్‌రావు– ప్రియాంక దంపతుల కూతురు వర్ణిక తన పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు. తంగళ్లపల్లి మండలంలోని లగిశెట్టి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్‌లోని వృద్ధులకు, కొలనూర్ శివారులోని ఇటుక బట్టి కార్మికులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అమ్మఒడి ఫౌండేషన్‌కు ఆర్థికసాయం అందించడమే కాకుండా వలస కూలీలకు అన్నదానం చేశారు.



ముస్తాబాద్: మండలకేంద్రంలో వీధికుక్కల బెడద ఎక్కువైంది. ముస్తాబాద్ మార్కెట్ ఏరియా, మటన్ మార్కెట్, తెలంగాణ చౌక్‌లో గుంపులుగా తిరుగుతున్నాయి. చేతిలో సంచులను లాగేసుకోవడమే కాకుండా దాడి చేస్తున్నాయి. ఇప్పటికే ఎందరో వీధికుక్కల దాడిలో గాయపడ్డారు. వెంటనే వీధికుక్కల బెడద నుంచి కాపాడాలి.

– మామిండ్ల దేవరాజు, ముస్తాబాద్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
పంచాయతీ కార్యదర్శి, రమేశ్ ఫోన్ నెంబర్ : 9866964956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048, 9705346626

దంచికొట్టిన వాన



కొలనూర్‌లో కురుస్తున్న వర్షం

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా ఒక్కసారిగా భారీ వర్షం కుమ్మరించింది. కోనరావుపేట మండలం కొలనూర్ వద్ద ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ జల్లులు కురిశాయి.

పాఠశాలను సందర్శించిన డీఈవో


గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సందర్శించారు. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యంతాగి బాటిళ్లను అక్కడే పడేసిన ఘటనపై ఆరాతీశారు. మందుబాబులు పాఠశాలలోకి రాకుండా సీసీ కెమెరాలు, గేట్ ఏర్పాటు చే యాలని ప్రధానోపాధ్యాయుడిని డీఈవో ఆదేశించారు.

చెక్కు అందజేత



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌లో పోతె కొమురయ్యకు చెందిన రెండు గొర్రెలు ఇటీవల వరద కాలువలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. దీంతో కొమురయ్యకు మంగళవారం మండల సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ సెస్ ద్వారా మంజూరైన రూ.14వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో సెస్ ఏఏఈ ప్రశాంత్, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీ స్వీకరించలేదని ఆవేదన



చందుర్తి: ప్రజావాణిలో తమ సమస్యను పరిష్కరించాలని అర్జీ అందిస్తే స్వీకరించలేదని మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బొజ్జ దేవేంద్ర అనే మహిళా రైతు వాపోయింది. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తిమ్మాపూర్ రెవెన్యూ పరిధిలోని 408/సీ/2 నెంబర్‌లో ఉన్న 1.01 ఎకరం భూమిలో 35 ఏళ్లుగా కాస్తులో ఉన్నట్లు తెలిపింది. తమ మామ బొజ్జ నర్సయ్యకు వారసత్వ భూమిగా వస్తుందని జనవరి 30న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టి పట్టా మార్పిడి కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపింది. తన భర్త గల్ఫ్ వెళ్లగానే తహసీల్దార్ ఈనెల 5న అక్రమ పట్టా చేశారని, ఈనెల 23న తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తమను అర్జీ స్వీకరించకుండా కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని దురుసుగా వ్యవహరించారని తెలిపింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆమె కోరుతోంది. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అర్జీతో పాటు ఆధారాలు చూపించాలని తెలిపామని, ఏదైనా సమస్య ఉంటే కోర్టుకు వెళ్లాలని సూచించినట్లు తెలిపారు.

● పరామర్శ

ముస్తాబాద్: ముస్తాబాద్ టీజేఏసీ కన్వీనర్ కోల పర్శరాములు గౌడ్ మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ శరత్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు పరామర్శించారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నజీర్ మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తాగునీటి సరఫరాపై శిక్షణ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో వినోద్

చందుర్తి: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకే గ్రామ సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈవో వినోద్ తెలిపారు. మంగళవారం చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో చందుర్తి, రుద్రంగి మండలాల్లోని గ్రామాల మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచీటి పైపులైన్‌ల నిర్వహణ, నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ ప్రక్రియలపై 4 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. చందుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవో నటరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సీహెచ్.ప్రేమ్‌కుమార్, ఏఈ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

తంగళ్లపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 30 గ్రామాల మంచినీటి సహాయకులకు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నీటి సహాయకులకు శిక్షణ మూడు రోజులపాటు ఉంటుందని, అనంతరం మిషన్ భగీరథ అధికారులు నీటి పరీక్షలు నిర్వహించే విధానాన్ని ప్రయోగం ద్వారా చూ పారు. మిషన్ భగీరథ సీఈ అమరేందర్, గ్రిడ్ ఈ ఈ విజయ్‌కుమారా, గ్రిడ్ ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట : మండలపరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. హైదరాబాదులో శిక్షణ పొందిన నవీన్ మంచినీటి సహాయకులకు పంపులు ఏ విధంగా బిగించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ అధ్యక్షత వహించగా, ఎంపీడీవో శశికళ, ఎంపీవో, మిషన్ భగీరథ ఇంజినీర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఐలమ్మ' ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా రాము



రాము

వేములవాడరూరల్: చాకలి ఐలమ్మ జయంతిని ఈనెల 26 హైదరాబాద్ రవీంద్రభారతిలో అధికారికంగా ప్రభుత్వం నిర్వహించనుంది. నున్నది. ఈ సందర్భంగా పలు కమిటీలను ప్రకటించింది. అందులో ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా వేములవాడకు చెందిన మైలారం రామును నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26న జరిగే జయంతికి రజక సంఘం సోదరులు తరలిరావాలని, తనను ఎంపిక చేసిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు